ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ..!



బస్టాప్ వద్ద రహదారిపై నిలిపిన ట్రావెల్స్ బస్సు



ఎన్‌ఏడీ సెంటర్‌లో ప్రయాణికులను పికప్ చేసుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- ఎన్‌ఏడీ సెంటర్ అడ్డాగా ప్రయాణికులకు వల
- రహదారిపైనే ట్రావెల్స్ బస్సుల తిష్ట
- ఆర్టీసీ ఆదాయానికి గండి
- చోద్యం చూస్తున్న అధికారులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్ అడ్డాగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారు. విశాఖ నగరం నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులను ఆర్టీసీ బస్సులు ఎక్కకుండానే ప్రైవేట్ ట్రావెల్స్ వారు ఎగరేసుకుపోతున్నారు. దీంతో ప్రజా రవాణా శాఖ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను ఎన్‌ఏడీ ఆర్టీసీ బస్‌స్టాప్ వద్దే నిలిపి ప్రయాణికులకు వల వేస్తున్నారు. రహదారిపైనే ప్రయాణికులను ఎక్కించుకుంటూ ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఆర్టీసీ, రవాణా శాఖల అధికారులు చోద్యం చూస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులతో పాటు రాజమహేంద్రవరం వరకు నడిపే టాక్సీలు సైతం ఇదే చోట నిలుపుతున్నారు.

ఆర్టీసీ అధికారుల మౌనమేలనో..

నగరంలో ఎన్‌ఏడీ జంక్షన్ ప్రధానమైన సెంటర్. అందుకనే ఇక్కడ ఆర్టీసీ కౌంటర్ కూడా ఏర్పాటు చేశారు. పెందుర్తి, ఇటువైపున మర్రిపాలెం, అటువైపున గోపాలపట్నం రైల్వే స్టేషన్, ప్రముఖ పుణ్య క్షేత్రమైన సింహాచలం దేవస్థానానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇలా అనేక మంది ఎన్‌ఏడీ సెంటర్‌లోనే బస్సుల కోసమని వేచి చూస్తారు. ఈ నేపథ్యంలోనే విశాఖ ద్వారకా స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ తప్పనిసరిగా ఎన్‌ఏడీ బస్‌స్టాప్‌లో ఆగేలా తగిన ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఆర్టీసీ సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు. ఇంతవరకూ బాగానే ఉన్నా.. బస్‌స్టాప్ వద్దే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను నిలిపి, ప్రయాణికులను ఎక్కించుకుపోతున్నా.. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రవాణ శాఖ అధికారులు ఏం చేస్తున్నట్లు..

ఎన్‌ఏడీ సెంటర్‌కు కూతవేటు దూరంలోనే జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఉంది. ప్రైవేట్ వాహనాల తనిఖీలపై ఎంతో శ్రద్ధ చూపే రవాణా శాఖ అధికారులు, ప్రైవేట్ ట్రావెల్స్ వైపు కన్నెత్తి చూడకపోవటం గమనార్హం. ప్రైవేట్ ట్రావెల్స్‌కు ఉన్న రవాణా అనుమతులు ఏంటి..? వాహనాన్ని అర్హత, అనుభవం గల డ్రైవర్ నడుపుతున్నాడా..? రాత్రి వేళల్లో తిరిగే బస్సుల్లో అదనపు డ్రైవర్ అందుబాటులో ఉన్నాడా..? ప్రయాణికులతో తిరిగి ట్రావెల్స్ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారా..? ఇలాంటి అనేక సందేహాలు ఉన్నాయి. ప్రజా రవాణా శాఖ ఆదాయానికి ప్రైవేటు ట్రావెల్స్ గండికొడుతున్నందున వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రహదారిపైనే బస్సులు

ఎన్‌ఏడీ సెంటర్ అంబేడ్కర్ నగర్ వైపు ఉన్న బస్‌స్టాప్ వద్ద రహదారిపైనే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు నిలుపుతున్నారు. ఈ కారణంగా బిర్లా జంక్షన్ నుంచి హైవేపై వస్తున్న వాహనాలకు ఇవి అడ్డంగా ఉంటున్నాయి. సిటీ బస్సులు, ఇతర వాహనాల కోసమని వేచి ఉన్న ప్రయాణికులకు ఇలాంటి పరిణామాలు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. దీని వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఇక్కడ వేచి ఉండేవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించిన తరువాత హడావుడి చేసేకంటే.. ట్రాఫిక్ పోలీసులు ముందుగానే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులతో ఎమ్మెల్యే గణబాబు



బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ ముందు నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



ఆర్పీపేట యూపీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యురాలు శశిప్రియాంక, సిబ్బంది

గోపాలపట్నం : పశ్చిమ బెంగాల్‌లో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం చేసి, హతమార్చడం అమానుషమని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఈ మేరకు శనివారం గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యురాలిపై జరిగిన ఘటన సభ్య సమాజం తలదించుకునేలా వుందన్నారు. ఈ ఘటనతో సంబంధం వున్న నిందితులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ సుజాత మాట్లాడుతూ ప్రాణాలు పోసే వైద్యులతో మృగాళ్లలా ప్రవర్తించడం దారుణమన్నారు. సాక్ష్యాలను మాయం చేసేందుకు విధ్వంసం సృష్టించడం శోచనీయమన్నారు. అక్కడి ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. వైద్యులకు రక్షణ కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళ వైద్యులకు భరోసా ఇవ్వాలని కోరారు.

ఆర్పీపేట యూపీహెచ్‌సీలో నిరసన

కంచరపాలెం : వెస్ట్ బెంగాల్‌లో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం ఘటనను నిరసిస్తూ జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట యూపీహెచ్‌సీలో ప్రధాన వైద్యాధికారి మట్టా శశిప్రియాంక నేతృత్వంలో శనివారం వైద్య సేవలు నిలిపివేసి నిరసన తెలిపారు. వైద్యులకు జాతీయ స్థాయి రక్షణ చట్టం తేవాలని, మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యులు, వైద్య సిబ్బంది ధర్నా కొనసాగించారు. డాక్టర్ శశి ప్రియాంక మాట్లాడుతూ ఇటీవల వైద్యులపై జరిగిన క్రూరత్వ సంఘటనలు వైద్య వృత్తిని కదిలించాయన్నారు. అనంతరం కంచరపాలెం ఫ్లైఓవర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భారతి అరుణ, దిలీప్, మహాలక్ష్మి, పైడిరాజు, పూర్ణ, సత్యనారాయణ రావు, రత్నం, చిట్టమ్మ, స్వాతి, భారతి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిరసన

విశాఖ విద్య: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచార ఘాతుకానికి నిరసనగా బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది శనివారం నిరసన తెలిపారు. ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రొంగలి రేవతి ఆధ్వర్యంలో సిబ్బంది అంతా విధులు బహిష్కరించి, ఆస్పత్రి ముందు బైఠాయించారు. ప్లకార్డులు చేతపట్టుకొని నినాదాలు చేశారు. ఆస్పత్రిలో సాధారణ వైద్య సేవలు నిలిచిపోయాయి. రోగులకు అత్యవసర సేవలను మాత్రమే అందించారు. వైద్యులు, సిబ్బంది రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య చేసిన నిందులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనలు



బొత్స సత్యనారాయణను అభినందిస్తున్న మళ్ల విజయప్రసాద్ తదితరులు

మల్కాపురం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, పలు వార్డుల కార్పొరేటర్లు పి.వి.సురేష్, ముర్రు వాణి, గుండపు నాగేశ్వరరావు తదితరులు శనివారం బొత్స నివాసానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జాన్‌వెస్లీ, దొడ్డి కిరణ్, రేవళ్ల సత్యనారాయణ, జీవీఎస్ఎన్ రాజు(కేబుల్ వాసు), అప్పలస్వామి, ఆడారి హరీష్, పూండి మల్లేశ్వరరావు, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బొత్సను కలిసిన బెహరా



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణతో బెహరా భాస్కరరావు తదితరులు

గోపాలపట్నం : ఎమ్మెల్సీగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు అభినందనలు తెలిపారు. శనివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ సంబంధిత అంశాలపై చర్చించారు.


సందడిగా చిల్డ్రన్ పార్కు



సందర్శకులతో కళగా కనిపిస్తున్న గుల్లలపాలెం చిల్డ్రన్ పార్కు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని చిల్డ్రన్ పార్కు శనివారం సాయంత్రం జనంతో కిటకిటలాడింది. ఇక్కడ అందమైన పరిసరాలు, చిన్నారులు ఆడుకోవడానికి అనేక ఆట పరికరాలు ఉండటంతో చాలా మంది కుటుంబ సభ్యులతో కలిసి పార్కుకు వచ్చి తమ పిల్లలతో సరదాగా గడుపుతున్నారు. పెద్దలు వాకింగ్ చేస్తూ ఇక్కడ సేద తీరుతూ పార్కు అందాలను ఆస్వాదిస్తున్నారు. ప్రతి శని, ఆదివారాల్లో చిల్డ్రన్ పార్కు సందర్శకులతో సందడిగా కనిపిస్తుందని పార్కు కమిటీ ప్రతినిధులు తెలుపుతున్నారు.

సాయిబాబా మందిరంలో భజనలు



బాబా పీఠం ముందు భజన చేస్తున్న మహిళ భక్తులు

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం, మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో గల సద్గురు షిర్డీ సాయిబాబా మందిరంలో శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం సందర్భంగా ఆలయ కమిటీ అధ్యర్యంలో గుల్లలపాలెం ఉడా కాలనీ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన నార్త్ ఇండియన్ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజ చేశారు. అనంతరం బాబా గీతాలు ఆలపిస్తూ భజన, నృత్యం చేశారు.

కార్పొరేటర్ నాగేశ్వరరావుకు ఇంటర్నేషనల్ గౌరవ డాక్టరేట్



కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న అతిథులు

సింధియా: గతంలో సేవారత్న అవార్డు అందుకున్న జీవీఎంసీ 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుకు జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలకు గానూ గౌరవ డాక్టరేట్ లభించింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దోమాన చిన్నారావు చారిటబుల్ ట్రస్ట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ ఆయనకు ఇంటర్నేషనల్ గౌరవ డాక్టరేట్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. నగరంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథులు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ చేతుల మీదుగా నాగేశ్వరరావు డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వివిధ సందర్భాల్లో తాను చేసిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పురస్కారంతో తనలో నూతన ఉత్తేజం వచ్చిందని, తన సేవలను మరింత విస్తృతం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులో వ్యర్థాల తొలగింపు



జవహర్‌నగర్‌లో పరిశుభ్రంగా సర్వీస్ రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు జవహర్‌నగర్, కొత్త రామాలయం వీధి తదితర ప్రాంతాల్లోని సర్వీస్ రోడ్లలో వ్యర్థాలు పేరుకుపోయాయి. స్థానికులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యపై 'వీధుల్లో వ్యర్థాలు తొలగించరూ..' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. వెంటనే స్పందించిన అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి సర్వీస్ రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్ పర్యవేక్షణలో పొక్లెయిన్‌తో సిబ్బంది తొలగించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అనిల్‌కుమార్‌కు పరామర్శ



అనిల్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: వైఎస్సార్ ట్రేడ్‌యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్(నేవీ అనిల్) భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. 60వ వార్డు ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలోని ఆయన ఇంటికి శనివారం మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, కార్పొరేటర్ పి.వి.సురేష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జాన్‌వెస్లీలు వెళ్లి పరామర్శించారు. అనిల్ భార్య చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. త్వరగా కోలుకోవాలని, అధైర్య పడవద్దన్నారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, పార్టీ పలు వార్డుల అధ్యక్షులు రేవళ్ల సత్యనారాయణ, దొడ్డి కిరణ్, ఆడారి హరీష్, జీవీఎస్ఎన్ రాజు(కేబుల్ వాసు), సంపత్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో ధరలు ఇలా..



ములగాడ హౌసింగ్ కాలనీ రైతుబజార్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలోని రైతుబజార్‌లో ప్రతి రోజూ ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కూరగాయలు, ఆకుకూరలు విక్రయిస్తున్నారు. వాటి ధరలు ఇలా ఉన్నాయి.

కూరగాయలు	10 కేజీలు	ఒక కేజీ			
తెల్లవంకాయలు (రౌండ్)	రూ.480	రూ.50			
గుత్తి వంకాయలు	రూ.480	రూ.50			
మిర్చి(రౌండ్)	రూ.580	రూ.60	అల్లం(కొత్త)	రూ.630	రూ.70/రూ.65
కాలీఫ్లవర్(గ్రేడింగ్)	రూ.340	రూ.36	గోరుచిక్కుడు	రూ.360	రూ.42/రూ.38
కాలీఫ్లవర్(అన్ గ్రేడింగ్)	రూ.300	రూ.32	బీట్‌రూట్	రూ.240	రూ.30/రూ.26
క్యారెట్	రూ.240	రూ.26	పొటల్స్	రూ.360	రూ.38/రూ.42

ఉచిత ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ , బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్‌నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ కోర్సులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 28 ఏళ్లలోపు పురుషులు, మహిళలు అర్హులన్నారు. మూడు నెలల పాటు శిక్షణతో ఉచిత భోజన, వసతి, యూనిఫాం, బుక్స్, ఏసీ క్యాంపస్ వంటి సదుపాయాలు ఉంటాయని తెలిపారు. ఇంటర్ పాసైన యువతీ యువకులకు బీఎస్సీ, డిప్లమో పారామెడికల్ కోర్సులకు కూడా అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పూర్తి వివరాలకు బొల్లినేని మెడ్‌స్కిల్స్, హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, ద్వారకానగర్, విశాఖపట్నం చిరునామాలో సంప్రదించాలని పేర్కొన్నారు. 7207953290, 7993011605 నంబర్లను కూడా సంప్రదించవచ్చునన్నారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమౌళి

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భారతీయ సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి చెప్పారు. మురళీనగర్ వాకర్స్ పార్కులోని క్లబ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరాణిక పద్య నాటకాల ప్రదర్శన, శాస్త్రీయ, జానపద నృత్యాల్లో ప్రతిభావంతులతో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రజలకు వాటి ప్రాధాన్యతను తెలియజేస్తామన్నారు. ఈ నెల 25న ఉచిత నేత్ర వైద్య శిబిరం, 29న గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం, కవితా గోష్ఠి, సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం, వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమల పంపిణీ నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, పి.చెల్వారాజు, జె.కూర్మారావు, ఏవీ సుబ్బారావు, ఎం.రామకృష్ణ, చొల్లంగి ప్రసాదరావు, జాలీ వాకర్, ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

ముగిసిన ధ్యాన యజ్ఞం



హాజరైన స్థానికులు

పెదగంట్యాడ: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, పత్రీజీ పిరమిడ్ స్పిరిర్చువల్ ట్రస్ట్ ప్రతినిధి మీసాల శివ గణేశ్వరరావు అన్నారు. భగవాన్ పితామహ పత్రీజీ దివ్య ఆశీస్సులతో మండలంలోని యారాడ గ్రామంలో గల పీఎస్సార్ కాలనీలో 41 రోజుల పాటు నిర్వహించిన ధ్యాన యజ్ఞనం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యారాడ గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. పీఎస్సార్ కాలనీలోని యువజన సేవా సంఘం భవనంలో 41 రోజుల పాటు ధ్యాన యజ్ఞం కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. బోరాడ రమణ, అప్పారావు, నాగోతి రమణ, బంక ఆంజనేయ పాత్రుడు, చిన్నారావు, సంధ్యా కుమారి, ఉమా కనకారావు పాల్గొన్నారు.

విషాదం నింపిన.. పోలీసుల నిర్లక్ష్యం!

- సెల్ఫ్ యాక్సిడెంట్ ఘటనలో వ్యక్తి మృతి
- కుటుంబ సభ్యులకు కనీస సమాచారమివ్వని ఎంవీపీ పోలీసులు



యింటి వీరవెంకట సత్యనారాయణ(ఫైల్)

ఎంవీపీకాలనీ: యింటి వీర వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి సెల్ఫ్ యాక్సిడెంట్ ఘటనలో ఎంవీపీ పోలీసులు వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యాక్సిడెంట్ అనంతరం కోమాలోకి వెళ్లిన సత్యనారాయణ రెండు రోజులుగా కేజీహెచ్‌లో మృత్యువుతో పోరాడి శనివారం మృతి చెందాడు. దీనిపై అతడి కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకపోవడం స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఘటనకు సంబంధించి వివరాలిలా.. యింటి వీరవెంకట సత్యనారాయణ తగరపువలసలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి మద్దిలపాలెం కేఆర్‌ఎం కాలనీలో నివసిస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ రాత్రి భార్య ఫోన్ చేసి వరలక్ష్మీ వ్రతం సామగ్రి కావాలని చెప్పడంతో.. సత్యనారాయణ 15వ తేదీ తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంపై మిత్రుడిని పెదవాల్తేర్‌లో దింపేసి శివాజీపాలెం మీదుగా ఇంటికి బయలు దేరాడు. అప్పటికే మద్యం తాగి ఉండటంతో శివాజీ పార్కు వద్ద సెల్ఫ్ యాక్సిడెంట్‌కు గురయ్యాడు. అటుగా వెళ్తున్న రాపిడో బాయ్ పోలీసులకు సమాచారమివ్వడంతో అక్కడికి చేరుకున్న ఎంవీపీ పోలీసులు కేజీహెచ్‌కు తరలించి చేతులు దులిపేసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన సత్యనారాయణ కోమాలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులకు కనీస సమాచారం అందించకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

మిస్సింగ్ కంప్లయింట్ ఇచ్చినా..

తన భర్త కనిపించడం లేదంటూ సత్యనారాయణ భార్య ఈ నెల 16న ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు కూడా నమోదు చేసిన పోలీసులు సత్యనారాయణ సెల్ఫ్ యాక్సిడెంట్‌పైనా, కేజీహెచ్‌లో కోమాలో ఉండటంపైనా ఆమెకు సమాచారం ఇవ్వకుండా అక్కడి నుంచి పంపించేశారు. సత్యనారాయణ కోసం గాలిస్తున్న కుటుంబ సభ్యులు ఎట్టకేలకు కేజీహెచ్‌లో అతడిని గుర్తించారు. రెండు రోజులుగా మృత్యువుతో పోరాడి చనిపోయినట్లు తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. శనివారం సాయంత్రం ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మృతుడి భార్య, కూతుళ్ల కన్నీటి పర్యంతమైన తీరు అందరినీ వేదనకు గురిచేసింది. పోలీసులు వ్యవహరించిన తీరు అమానవీయమంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

జనావాసాల మధ్య సెల్ టవర్ వద్దు



సెల్ టవర్ ఏర్పాటు చేసిన ఇంటి ముందు స్థానిక మహిళలు



ఆదర్శనగర్‌లో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సెల్ టవర్

ఆరిలోవ: పాత డెయిరీఫారం ప్రాంతం ఆదర్శనగర్‌లోని ఓ ఇంటిపై సెల్ టవర్ ఏర్పాటు వివాదంగా మారింది. సెల్ టవర్ వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెల్ టవర్ మాకొద్దంటూ వ్యతిరేఖిస్తున్నారు. ఇక్కడ ఓ ఇంటిపైన ఎయిర్ టెల్ కంపెనీకి చెందిన సెల్ టవర్ ఏర్పాటు చేసుకోవడానికి ఇంటి యజమాని టవర్ నిర్వాహకులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో కొద్ది రోజులుగా టవర్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

ఇంటిపైన సెల్ టవర్ ఏర్పాటు చేశారు. దానికి కేబుళ్ల ఆపరేటింగ్ సిస్టం అమర్చాల్సి ఉంది. దీంతో శనివారం స్థానికులు ఆ ఇంటి వద్దకు చేరుకుని సెల్ టవర్ నిర్మాణం పనులు నిలిపేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. సెల్ టవర్ వల్ల నివాసులు అనారోగ్యం పాలవుతామని, రేడియేషన్ సమస్యలకు గురవుతామన్నారు. గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు ఎక్కువగా దీని సమస్యతో అనారోగ్యానికి గురవుతారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సెల్ టవర్ ఇక్కడ ఏర్పాటు చేయవద్దంటూ నినాదాలు చేశారు. పనులు వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. లేదంటే స్థానికులం అంతా కలసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ముడిసరకు ఇప్పించి స్టీట్ ప్లాంట్‌ను ఆదుకోవాలి



మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారం నడవడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే ముడిసరకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, వరసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1283వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముడి సరకు నిల్వలు తగ్గిపోవడం కేంద్ర ప్రభుత్వం కుట్రలో భాగమని ఆరోపించారు. ఉక్కు ఉత్పత్తికి విఘాతం కలిగించి, కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకుండా ఉక్కు ఆస్తులను ప్రైవేటు తొత్తులకు అప్పజెప్పాలనే లక్ష్యంతో ఉన్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, డి.శ్రీనివాస్, రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, గోపాలరాజు, సుబ్బారావు, శ్రీనివాసరావు, నరసింగరావు, మధు, రమేష్ పాల్గొన్నారు.